దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట: వివిధ పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30లోగా నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని ప్రిన్సిపల్ మోహన్‌దాస్ గురువారం తెలిపారు. డీఈసీజీ, డయాలసిస్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుతో పాటు ధ్రువపత్రాల నకళ్లను జతపర్చాలన్నారు. వివరాల కోసం టీజీపీఎంబీ. తెలంగాణ. జీవోవీ. ఇన్‌లో చూడాలన్నారు.

ఆమె ధైర్యం.. షీటీం!

పదేళ్లకు ముందు: ఆకతాయిల ఆగడాలు, వారి వికృత చేష్టలు.. ఆ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి అతివలది..

ప్రస్తుతం: ధైర్యంగా షీ టీంలకు చెబుతున్నారు. బృందాల్లోని సభ్యులు మఫ్టీల్లో తిరుగుతూ ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. కేసులు పెట్టి కటకటాల్లోకి నెడుతూ మహిళలకు భరోసా ఇస్తున్నారు.

SHE TEAMS
TELANGANA POLICE
Safety for Her Ensured


మహిళల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం 2014 అక్టోబరు 24న అందుబాటులోకి తీసుకొచ్చిన షీటీం వ్యవస్థ పదేళ్లు పూర్తి చేసుకుంది. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఈ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అతివలకు భరోసా కల్పిస్తున్నాయి. విద్యా సంస్థలు, ప్రజలు ఎక్కువగా గుమ్మిగూడే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం

మీకు తెలుసా..

- ఈవ్‌టీజింగ్ చేస్తూ రెండోసారి పట్టుబడితే నిర్భయ చట్టం కింద కేసులను నమోదు చేస్తారు.
- షీటీంలో ఇన్‌స్పెక్టర్, ఎస్సై, ఏఎస్సై, హెచ్‌సీ, మహిళా కానిస్టేబుళ్లు ఉంటారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ ఏసీపీ, మహబూబాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీ పర్యవేక్షణలో ఈ బృందాలు పని చేస్తున్నాయి.

పదేళ్లు పూర్తి చేసుకున్న వ్యవస్థ



నిఘా పెట్టి.. కౌన్సెలింగ్ ఇచ్చి

- ఆరు నెలల కిందట హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలో ఆకతాయిలు విద్యార్థినులను వేధిస్తుండడంతో ఓ మహిళ.. షీటీంకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన బృందం నిఘా పెట్టి వేధింపులకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చింది.
- మూడు నెలల కిందట వరంగల్ పోచమ్మ మైదానం ప్రాంతంలో బస్సులు నిలిపే స్థలంలో కొంతమంది యువకులు మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్నట్లు సమాచారం రావడంతో షీ బృందం మఫ్టీలో ఉండి వారిని పట్టుకుంది.
- మిల్స్ కాలనీ ఠాణా పరిధిలో ఓ మహిళను స్థానికంగా ఉండే యువకులు వేధిస్తుంటే షీ బృందానికి ఫిర్యాదు వెళ్లింది. వారిని కేసు నమోదు చేయించారు.
- హనుమకొండలో దుకాణంలో ఉన్న మహిళను వేధిస్తున్న ఆటో డ్రైవర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు.



గోడపత్రికల ద్వారా ప్రచారం చేస్తున్న షీ బృందం సభ్యులు

క్యూఆర్ కోడ్‌తో..



ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా ఫిర్యాదు చేసేందుకు షీ టీంలు 2022లో క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చాయి. కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సినిమా థియేటర్లు, ఆర్టీసీ బస్సుల్లో.. ఇలా జనాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ పోస్టర్లను అతికించారు. బాధితులు తమ ఫోన్ ద్వారా దానిని స్కాన్ చేయగానే డీజీ ఆఫీసుకు ఫిర్యాదు వెళ్తుంది. వెంటనే దరఖాస్తు ఫారం వస్తుంది. వివరాలు నమోదు చేసి సెండ్ చేసిన వెంటనే జిల్లా షీటీంకు సంక్షిప్త సమాచారం వెళ్తుంది. బృందం అక్కడికి చేరుకుని ఆకతాయిల ఆటకట్టిస్తారు.

- qr.tspolice.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి లాగిన్ అయ్యి ఫిర్యాదు చేస్తే సరిపోతుంది.

కేసులు నమోదు ఇలా

	2022	2023	2024
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో	425	525	342
మహబూబాబాద్ పోలీస్‌శాఖ..	09	47	30

ఫిర్యాదుల సంఖ్య పెరిగింది

- సుజాత, షీ టీం విభాగం ఇన్‌స్పెక్టర్

గతంలో కంటే ప్రస్తుతం ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. మహిళలకు ఉన్న చట్టాలు, రక్షణ గురించి కళాశాలలు, పాఠశాలల్లో షీ బృందం అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. వారికి రక్షణగా ఉంటుంది. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది స్పందిస్తారు.

ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

డయిల్ 100, 112

వరంగల్ కమిషనరేట్ షీ టీం నెంబరు: 87126-85124

మహబూబాబాద్ షీ టీం నెంబరు, వాట్సాప్: 8712656935, 7901142009

- ఫిర్యాదు చేసినవారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

షీ టీంలు ఉమ్మడి జిల్లాలోని పాఠశాల, కళాశాలల్లో గుడ్, బ్యాడ్ టచ్‌లపై, పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. గుడ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటి.. ఏవిధంగా వేధిస్తారో ప్రాక్టికల్‌గా చూపిస్తూ. . ఆ సమయంలో రక్షణ కోసం ఎలా స్పందించాలో బాలికలకు వివరిస్తున్నారు.



మహబూబాబాద్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం..

కాజీపేట ఆర్వోబీ నిర్మాణమెప్పుడు?

రైల్వే జీఎం సమావేశంలో గళమెత్తిన ఎంపీలు

కాజీపేట, మహబూబాబాద్, కేసముద్రం, న్యూస్‌టుడే: ఓరుగల్లు ఎంపీలు రైల్వే సమస్యలపై గళమెత్తారు.. దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన కాజీపేట జంక్షన్‌తో పాటు ఇతర రైల్వే స్టేషన్లలో నెలకొన్న సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అత్యంత కీలకమైన కాజీపేటలో కొత్త రైల్వే వంతెన నిర్మాణం (ఆర్వోబీ) త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సికింద్రాబాదు రైలు నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీలతో జీఎం అరుణ్‌కుమార్ జైన్ నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి వరంగల్ నుంచి కడియం కావ్యతో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పాల్గొన్నారు.

ఎంపీ కావ్య ప్రస్తావించిన అంశాలు..



- వరంగల్ నగరం అభివృద్ధిలో కీలకమైన అసంపూర్తి ఆర్వోబీ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి. వంతెన పనుల జాప్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఉన్న ఆటంకాలను తొలగించడానికి కృషి చేస్తాం.. రైల్వేశాఖ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి.
- కాజీపేటను రైల్వే డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి
- చింతపల్లి, ధర్మసాగర్ బైపాస్ లైన్ల నిర్మాణంలో రైల్వే శాఖ పునరాలోచించి రైతులకు నష్టం కలగకుండా చూడాలి. కొత్తలైన్ల నిర్మాణంలో రైల్వే స్థానిక రైతులు, అధికారుల సూచనలు తీసుకోకుండా, ప్రజాభిప్రాయం సేకరించకుండా నిర్ణయం తీసుకోవడం సబబు కాదు..
- మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేయడం హర్షణీయం
- కాజీపేట స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫారాలు, వేచిఉండు గదుల ఆవశ్యకత

మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్..



- సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో వందేభారత్‌తో పాటు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఇవ్వాలి.
- మహబూబాబాద్‌లో గరీబ్‌రథ్, రప్తీసాగర్, గ్రాండ్‌ట్రంక్, ఏపీ ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలి.
- కేసముద్రంలో బీదర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి(అప్), కరీంనగర్ సూపర్‌ఫాస్ట్, సాయినగరషిర్డీ, సాయినగర్ షిర్డీ వీక్లీ రైళ్లను హాల్టింగ్‌ను పునరుద్ధరించాలి. నాగర్‌సోల్, ఇంటర్‌సిటీ రైళ్లను కూడా నిలపాలి.
- డోర్నకల్‌లో పద్మావతి, కోణార్క్, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలి.
- నెక్కొండలో ఇంటర్‌సిటీ, శాతవాహన, చార్మినార్, నవజీవన్, షిరిడీ, కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలి. తాళ్లపూసపల్లి గేట్ నెంబర్ 79 సమీపంలో అసంపూర్తిగా మిగిలిన రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేయండి



వీసీలో పాల్గొన్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'హర్ ఘర్ జల్ యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, మిషన్ ఇంద్ర ధనుష్' తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీలను నవంబర్ 30లోగా ఎంపిక చేయాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులకు సూచించారు. 2025 గణతంత్ర వేడుకలకు ఉత్తమ సర్పంచులను ఆహ్వానించేందుకు.. అవసరమైన మార్గదర్శకాలపై న్యూదిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి వి.శ్రీనివాస్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పంచాయతీ అధికారి కల్పనలతో కలిసి జిల్లా పాలనాధికారి పాల్గొన్నారు.

సలహాలు, సూచనలిచ్చేందుకు హాజరుకావాలి

వరంగల్ కలెక్టరేట్: రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులతో నవంబరు 2న హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశం ఉంటుందని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద గురువారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ పరిధిలోని అన్ని కులాల ప్రతినిధులు.. వారి కులాల్లో ఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్యలు, తదితర సలహాలు, సూచనలు, ఆక్షేపణలు తెలిపేందుకు కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

లలిత సహస్ర నామ పారాయణం




రామన్నపేట, న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం తలపెట్టిన శ్రీసహస్ర చండీయాగం నాలుగోరోజు కొనసాగింది. గురువారం పడిశాల సుజాత ఆధ్వర్యంలో మహిళలతో లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించారు. చండీయాగంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్, జలగం అనిత, శ్రీకాంత్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం మహా పూర్ణాహుతి, అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డా.ప్రశాంతి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది ఉన్నారు.

కోతుల బెడద.. స్థానికులకు దడ!



గ్రేటర్ వరంగల్ మేయర్ సుధారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్‌లోని రామన్నపేట, పాపయ్యపేట, రఘునాథ్ కాలనీ, ఓఎస్‌నగర్, బట్టలబజారులో కోతుల బెడదతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పిన్నావారివీధి, పాత బీటుబజారు, దుర్గేశ్వరాలయం ప్రాంతాల్లో స్థానిక వ్యాపారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజామునే గుంపులుగా కోతులు ఇళ్లలోకి చొరబడుతున్నాయని రామన్నపేట ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సమస్య పరిష్కరించాలని గురువారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. – న్యూస్‌టుడే, రామన్నపేట

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీందర్

నర్సంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సంపేటకు చెందిన కూచన రవీందర్‌ను నియమించినట్లు ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రవీందర్ మాట్లాడుతూ మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పద్మశాలీలు, చేనేత కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

దేవాదాయశాఖ ఆధీనంలోకి కాశీబుగ్గ గుడి



ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటిస్తున్న దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ చిత్రంలో ఈఓ వెంకట్రావు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వరంగల్‌లోని కాశీబుగ్గకే పేరు తెచ్చిన శ్రీకాశీవిశ్వేశ్వర, రంగనాథ స్వామి దేవాలయానికి గురువారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది వచ్చారు. దేవాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆలయ ఈఓగా వెంకట్రావు బాధ్యతలు స్వీకరించారు. శివాలయానికి సంబంధించిన రికార్డులను ఆలయ ప్రతినిధి గోనే జగదీశ్వర్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. దేవుళ్ల నగలు, బ్యాంకు ఖాతా పుస్తకాలను భద్రపరిచారు. ఆలయంలో ఉన్న హుండీలతో పాటు ఆభరణాలు, ఇతర వస్తువులను భద్రపర్చి సీల్ వేశారు. రంగనాథస్వామి ఆలయంలో హుండీలను స్వాధీనం చేసుకున్న తర్వాత బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాలని ఆలయ ప్రతినిధి చిలుపూరి సురేశ్ బృందాన్ని ఈఓ ఆదేశించారు. రెండు దేవాలయాలను స్వాధీనం చేసుకున్న అనంతరం కాశీబుగ్గ శివాలయ ప్రాంగణంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, కాశీబుగ్గ ఈఓ వెంకట్రావు, దేవాదాయశాఖ సిబ్బంది వెంకటయ్య, కృష్ణమూర్తి, మహిపాల్, వీరస్వామి, ప్రసాద్, సౌజన్య బృందాన్ని కాశీబుగ్గ వర్తక సంఘం అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి బృందం సత్కరించి, ఆలయ చిత్రాన్ని బహూకరించారు.

వసతిగృహం.. చలికాలం కష్టం!



నర్సంపేట ఎస్సీ-ఏ వసతిగృహంలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

నర్సంపేటలోని సాంఘిక సంక్షేమ (ఎస్సీ-ఎ) బాలుర వసతిగృహంలో 3-10వ తరగతి వరకు 80 మంది విద్యార్థులున్నారు. నాలుగేళ్ల క్రితం బంకర్ (బెడ్స్) పడకలను ఉన్నతాధికారులు పంపిణీ చేశారు. నాసిరకమైనవి తెప్పించడంతో త్వరగానే పాడయ్యాయి. వాటిని రెండేళ్ల క్రితం ఓ గదిలో నిల్వ చేశారు. పదో తరగతికి చెందిన 12 మంది విద్యార్థులు పడకలు వినియోగిస్తున్నారు. మిగిలిన తరగతుల విద్యార్థులు నేలపై కార్పెట్లు పర్చుకొని నిద్రిస్తున్నారు. చలికాలం కావడంతో నేల చల్లగా ఉంటుందని పిల్లలు వాపోయారు. కొంతమంది ఇంటి నుంచి తెచ్చుకున్న చాపలు కింద పరుచుకుంటున్నారు. కిటికీలకు జాలి అమర్చనందున దోమల బెడద ఉంది. జులై, ఆగస్టు నెలలో కార్పెట్లు, బెడ్‌షీట్లు అందించారని దుప్పట్లు రాలేదని తెలిపారు. ఉదయం వేళ చల్లటి నీటితో స్నానం చేయడం ఇబ్బందిగా ఉందన్నారు. – న్యూస్‌టుడే, నర్సంపేట

పరిశీలన

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇంటి వద్ద చదువుకునే వాతావరణం లేని నిరుపేద విద్యార్థుల కోసం ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను ఏర్పాటు చేసింది. అయితే వాటిలో పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో.. తిప్పలు తప్పడం లేదు. చాలావరకు ప్రభుత్వ, అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహాల్లో తలుపులు, కిటికీలు సరిగాలేక.. విద్యార్థులు చలితో సావాసం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో గతేడాది పంపిణీ చేసిన బెడ్‌షీట్లు, దుప్పట్లు మాత్రమే ఉన్నాయి. సోలార్‌తో నడిచే వేడినీటి యంత్రాలు కొంతకాలం మూలనపడి ఉన్నాయి. అధికారులు వాటికి మరమ్మతులు చేయించిన దాఖలాలులేవు. దీంతో విద్యార్థులకు చన్నీటి స్నానాలే దిక్కయ్యాయి. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉండే అన్ని వసతిగృహాల్లోని వసతులపై 'న్యూస్‌టుడే' బృందం బుధ, గురువారాల్లో పరిశీలన చేపట్టింది.

దాతలూ.. ముందుకురండి!

చలి మొదలైంది.. ప్రభుత్వ వసతిగృహాల్లో పేద విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. చాలా వసతి గృహాల్లో పిల్లలకు దుప్పట్లు ఇంకా అందలేదు. కిటికీలకు తలుపులు లేక, దోమలు రాకుండా జాలీలు లేక సతమతమవుతున్నారు. చలిలో వణుకుతూ దోమలతో యుద్ధం చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈనేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దాతలు, స్పందించి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. స్థానికులు, ప్రజా ప్రతినిధులు కూడా చేయూత అందిస్తే మేలు.

జిల్లాలోని వసతిగృహాలు	ప్రీమెట్రిక్	విద్యార్థులు
బీసీ	5	374
ఎస్సీ	5	220
ఎస్టీ	7	724

ప్రతిపాదనలు పంపించాం.

- సౌజన్య, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి

జిల్లాలోని గిరిజన వసతిగృహాల్లో బెడ్‌షీట్లు, దుప్పట్లు కోసం ప్రతిపాదనలు పంపించాం. కొద్దిరోజుల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తాం. జిల్లాలోని ప్రీమెట్రిక్ వసతిగృహాల మరమ్మతుల కోసం ఏటూరునాగారం ఐటీడీఏ ఒక్కో వసతిగృహానికి రూ.20 వేలు కేటాయించింది. వాటితో వసతిగృహాల తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేయించాం. వసతిగృహాల్లోని విద్యార్థుల కోసం ఈ ఏడాది స్వెట్టర్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం.

ఏ కాలమైనా చన్నీటి స్నానమే!



శివనగర్‌లోని వసతి గృహంలో..

శివనగర్‌లోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాలకు చెందిన మొత్తం 80 మంది విద్యార్థులున్నారు. వారంతా పడకలు లేక నేలపైనే నిద్రిస్తున్నారు. 'కప్పుకోవడానికి దుప్పట్లు ఇవ్వలేదని, ఇంటి నుంచి తెచ్చుకున్న వాటితోనే సరిపెట్టుకుంటున్నామని' విద్యార్థులు తెలిపారు. కిటికీలు సరిగా లేక వర్షం వచ్చినప్పుడు గదుల్లోకి నీరు వస్తుందన్నారు. ఏ కాలమైనా చన్నీటి స్నానాలే దిక్కని వాపోయారు. ఆహార పట్టిక(మెనూ) ప్రకారం గురువారం ఉదయం అల్పాహారం(టిఫిన్) ఉప్మా ఇవ్వాలి. కానీ! ఆలూబిర్యానీ పెట్టారు. వసతిగృహంలో వార్డెన్ అందుబాటులో లేరు. మెనూపై వార్డెన్‌ను 'న్యూస్‌టుడే' చరవాణిలో సంప్రదించగా.. విద్యార్థుల కోరిక మేరకు అందిస్తున్నామన్నారు. దుప్పట్లు, పడకలు ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. – న్యూస్‌టుడే, శివనగర్

ఒకే దుప్పటి ముగ్గురికి..



వరంగల్ ప్రాంతంలోని రంగంపేట గిరిజన వసతి గృహంలో 45-50 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకే దుప్పటి ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు కప్పుకొంటున్నారు. కొందరికి దుప్పట్లు లేవు. విద్యార్థులు నిద్రించే గది కిటికీ తలుపులు సరిగా లేకపోవడంతో చలి, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. వసతిగృహం భవనం శిథిలావస్థకు చేరింది. భోజనశాల, బెంచీలు లేక బయట కూర్చొని భోజనం చేస్తున్నారు. మరుగుదొడ్ల తలుపులు కూడా సరిగా లేవు.

– న్యూస్‌టుడే, రంగంపేట

రవాణా సేవల్లో డీడీల హైరానా!

దళారులను ఆశ్రయిస్తేనే పని.. ఎనుమాముల మార్కెట్ ప్రాంతానికి చెందిన సూర్య టాటాఏస్ వాహనానికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇటీవల భూపాలపల్లి జిల్లాలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పట్టుబడిన వాహనాన్ని విడిపించుకునేందుకు వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి రాగా రూ.7,225 జరిమానా విధించారు. ఈ మొత్తం డీడీ రూపంలో చెల్లించేందుకు బ్యాంకుల చుట్టూ తిరిగినా.. ఫలితం లేకపోవడంతో కార్యాలయం పరిసరాల్లోని దళారిని ఆశ్రయించాడు. ఒక డీడీలో ఈ మొత్తం లేక పోవడంతో రెండు డీడీలు ఇచ్చాడు. ఒక డీడీకి రూ.200 చొప్పున రూ.400 అదనంగా చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దళారీ లేనిదే డీడీ పని కావడం లేదు. డీడీల బదులు అంతర్జాలంలో రుసుం చెల్లించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. –రంగశాయిపేట, న్యూస్‌టుడే

రవాణాశాఖ కార్యాలయాల్లో డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్) ద్వారా చెల్లింపులు చేయాలనే నిబంధన వాహనదారులకు ఇక్కట్లు తెచ్చి పెడుతోంది. నగదు రహిత ఆన్‌లైన్ సేవలకు అవకాశం ఉన్నా ఇప్పటికీ కొన్ని ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయి. వీటిని అధిగమించాలంటే.. రవాణాశాఖ అంతర్జాల సేవలు మెరుగుపరచాలి.


వరంగల్ ఆర్టీఏ కార్యాలయం

ఇప్పటికే వాహనదారులు రుసుంలన్నీ మీసేవ, ఈ-సేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లిస్తున్నారు. ముందస్తు స్లాట్ విధానం సైతం అంతర్జాలంలోనే అమలు చేస్తున్నారు. మరిన్ని రుసుంలు సైతం చరవాణి సాయంతో ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యాప్‌లతో చెల్లించేలా చూడాలి. లేదంటే రవాణాశాఖ ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడి చరవాణికి ఎస్ఎంఎస్ పంపించేలా మార్పులు చేయాలి. కార్యాలయాల్లో దరఖాస్తు నంబరును నిక్షిప్తం చేస్తే స్కానర్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ విధానం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారు.

ఆందోళన

బ్యాంకుల్లో తప్పని ఇక్కట్లు

వాహనదారులు రుసుంలు, చెల్లింపులు డీడీల రూపంలో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డీడీల కోసం బ్యాంకుల కోసం వెతకాల్సిన పరిస్థితి. బ్యాంకు వరకు వెళ్లాక ఖాతాదారుడికే డీడీలు ఇస్తామని నిబంధన పెట్టడంతో తలపట్టుకుంటున్నారు. గతంలో నేరుగా ఇచ్చేవారు. నూతన విధానంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే తమకు ఖాతాలు ఎలా ఉంటాయని వాపోతున్నారు.



చేతివాటం ప్రదర్శిస్తున్న దళారులు

ఇదే అదనుగా దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాహనదారులకు అవసరమైన డీడీలను దళారులు నిల్వ చేసి ఎక్కువ మొత్తంలో విక్రయిస్తున్నారు. పనులు తొందరగా ముగించుకోవాలనే దృక్పథంతో కార్యాలయాల పరిసరాల్లో ఉన్న దళారులను ఆశ్రయించడంతో చెప్పినంత అదనంగా చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. లేదంటే వచ్చిన పని మరో రోజుకు వాయిదా పడుతుంది. బ్యాంకర్ల కొత్త నిబంధనలతో దళారులకు పంట పండుతుంది.

సమయం వృథా..

వాహన పన్నులు, జరిమానాలు, ఇతర రాష్ట్రాల వాహనాల మార్పు, ఇతర కేసులు నమోదు చేసిన సమయంలో చెల్లించాల్సిన రుసుంలన్నీ డీడీల రూపంలోనే కార్యాలయాల్లో తీసుకుంటున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో డీడీ నంబరు, బ్యాంకు పేరు, ఇతర వివరాలు నమోదు చేస్తారు. వచ్చిన డీడీలను ప్రతిరోజు ఓ వ్యక్తి ట్రెజరీలో జమ చేయాల్సి ఉంటుంది. దీంతె చాలా సమయం వృథా అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు జరిగే వాహనాల రిజిస్ట్రేషన్లు, కార్యాలయానికి వచ్చే డీడీల సంఖ్య వివరాలు (సుమారుగా)

జిల్లా	రిజిస్ట్రేషన్లు	డీడీలు
హనుమకొండ	70	40
వరంగల్	60	30
జనగామ	40	25
మహబూబాబాద్	45	25
భూపాలపల్లి	30	20
ములుగు	30	20

రెండు నెలల్లో మార్పులు వస్తాయి

- పుప్పాల శ్రీనివాస్ రవాణాశాఖ ఉప కమిషనర్



రవాణాశాఖ కార్యాలయాల్లో మరో రెండు నెలల్లో సమగ్ర మార్పులు వస్తాయి. వాహనదారులు ఎదుర్కొంటున్న డీడీల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లాం. సాంకేతిక పరమైన మార్పులు, డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రణాళిక చేస్తున్నారు. త్వరలోనే అమలు చేసేందుకు కసరత్తులు జరుగుతున్నాయి.

ఇదీ నేపథ్యం.. వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని శాయంపేట హవేలీ, స్టేషన్ చింతలపెల్లి గ్రామాల్లో కాకతీయ మెగా జౌళి వస్త్ర పరిశ్రమకు 2017 అక్టోబరు 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) ద్వారా 1350 ఎకరాల భూమిని సేకరించింది. ప్రాజెక్టు వ్యయం రూ.1150.47 కోట్లు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందులో మౌలిక సదుపాయాల కోసం రూ.706.87 కోట్లను ఖర్చు చేసింది. ప్రధానంగా భూసేకరణకు రూ.159.27 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ. 547 కోట్లను వెచ్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది అంచనా.

కాకతీయకు కైటెక్స్ కళ!

● డిసెంబరులో వస్త్ర పరిశ్రమ ప్రారంభానికి సన్నాహాలు

పరకాల, గీసుకొండ, న్యూస్‌టుడే

వరంగల్ ఉమ్మడి జిల్లాకు తలమానికంగా నిలుస్తున్న కాకతీయ మెగా జౌళి టెక్స్‌టైల్ పార్కులో త్వరలో మరో వస్త్ర పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. దుస్తుల తయారీ సంస్థలో పేరు పొందిన 'కైటెక్స్' పనులు చివరి దశకు చేరుకున్నాయి. డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.


కాకతీయ వస్త్రపరిశ్రమలో కైటెక్స్ కంపెనీ నెలకొల్పిన యూనిట్లు

ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు..

వస్త్రపరిశ్రమకు శంకుస్థాపన చేసి ఏడేళ్లలో ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు యూనిట్‌లను స్థాపించాయి. గణేషా ఎకోటెక్, యంగ్‌వన్‌తోపాటు కైటెక్స్ ముందుకొచ్చాయి.

● ఉత్తరప్రదేశ్ కేంద్రంగా పని చేస్తున్న గణేషా ఎకోటెక్ సంస్థ మొదటిసారిగా 50 ఎకరాల భూమిని తీసుకుని రూ. 500 కోట్ల పెట్టుబడితో రెండు యూనిట్లను ప్రారంభించింది. ఇక్కడ దేశంలోనే మొదటిసారిగా ప్లాస్టిక్ ఖాళీ సీసాలతో దారం తయారు చేసే పరిశ్రమను నెలకొల్పారు. దీని వల్ల 600 మంది ఉపాధి పొందుతున్నారు.

● దక్షిణ కొరియా దేశానికి చెందిన ప్రముఖ యంగ్‌వన్ సంస్థ క్రీడా దుస్తుల పరిశ్రమ నెలకొల్పడానికి ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వస్త్రపరిశ్రమలో 297 ఎకరాల భూమిని తీసుకుంది. ఈ సంస్థ రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతోంది. 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని అంటున్నారు. ప్రస్తుతం ఒక షెడ్డును ఏర్పాటు చేసి 70 మంది మహిళలకు కుట్టుపై శిక్షణ ఇస్తున్నారు. సూరత్, బీవండి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికుల కోసం వస్త్ర పరిశ్రమలో యూనిట్లు నెలకొల్పడానికి ప్రభుత్వం 52 ఎకరాల భూమిని కేటాయించింది.

ఆనందం

చిన్న పిల్లల దుస్తుల తయారీ ఇక్కడే..

కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ సంస్థ చిన్నపిల్లల దుస్తుల తయారీ పరిశ్రమను నెలకొల్పుతోంది. ఈ కంపెనీకి 187.24 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది పరిశ్రమ స్థాపనకు రూ.1200 కోట్లను వెచ్చిస్తోంది. అవసరమైన షెడ్లను నిర్మించి దుస్తుల తయారీకి కావాల్సిన యంత్రాలను అమరుస్తున్నారు. పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఇది పూర్తయితే 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. తొలుత వెయ్యి మందికి ఉపాధి కల్పించాలని చూస్తున్నారు. జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్త్ర పరిశ్రమను సందర్శించగా ఇదే కైటెక్స్ కంపెనీలో వన మహోత్సవాన్ని ప్రారంభించారు.

సృజన వీచిక.. ఆవిష్కరణలకు వేదిక


భూపాలపల్లిలో తరగతి గదిలో విద్యార్థులు

న్యూస్‌టుడే, భూపాలపల్లి

SCHOOL INNOVATION MARATHON

ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థులు చిన్న వయసులో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వం, విద్యా శాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' అనే కార్యక్రమం చేపట్టాయి.. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇదో చక్కటి అవకాశం.. 2024-25 సంవత్సరానికి ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఏఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లాల సైన్సు అధికారులకు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు, సైన్సు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని భూపాలపల్లి జిల్లా సైన్సు అధికారి బి. స్వామి తెలిపారు.

జనవరిలో విజేతల ప్రకటన: నవంబరు 30 నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో వెయ్యి మంది విజేతలను ప్రకటిస్తారు. వచ్చే మే నెలలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద 'ఇన్నోవేషన్ షో'లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలు ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు. భూపాలపల్లి డీఈవో రాజేందర్ మాట్లాడుతూ.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా హెచ్ఎంలు, సైన్సు అధికారులు ప్రోత్సహించాలని చెప్పారు.

అవకాశం

ఎవరికి అవకాశం..?:

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో మొత్తం 3,328 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 85కు పైగా ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. 6 నుంచి 10 తరగతి వరకు 2.41 లక్షల మంది, ఇంటర్‌లో 12 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తర్వాత వారి ఆలోచనలు అందులో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే ప్రాజెక్టుల రూపకల్పన ఏవిధంగా ఉండాలంటే.. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే.. ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

'స్కిల్ డెవలప్‌మెంట్' సభ్యురాలిగా ఎంపీ కావ్య

రంగంపేట, న్యూస్‌టుడే: భారత పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఎంపికయ్యారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ కావ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి!



వైద్యపరంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం రోగులతో సందడిగా ఉండే ఆసుపత్రిలో పలు వార్డుల్లో పెచ్చులూడిపడుతున్నాయి. ఏ క్షణంలో మీద పడతాయో తెలియని పరిస్థితి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చినవారు ఇక్కడి పరిస్థితి చూసి ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. వైద్య సేవల సంగతి పక్కన పెడితే.. వసతి, సౌకర్యాలు తీసికట్టుగా ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మరమ్మతులు చేసినా.. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. పెచ్చులూడి స్లాబులోని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు గోడలు చెమ్మతో మరింత బలహీన పడుతున్నాయి. గత వారం ఓ వార్డులో పెచ్చులూడి కిందపడగా.. త్రుటిలో ప్రమాదం తప్పింది.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి


పురుషుల కొత్త(న్యూ మేల్) మెడికల్ వార్డు వద్ద


ఖైదీల వార్డుకి వెళ్లే దారిలో..



కిచెన్ కాంప్లెక్స్ మార్గంలో..


మహిళల మెడికల్ వార్డు వైపు..



ఆర్ఎంఓ కార్యాలయం వద్ద..

173 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ. 4.48 లక్షల విలువైన 173 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... పరకాలకు చెందిన బి.రఘు చుట్టపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్‌మిల్లులో నిల్వ ఉంచినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం ఇచ్చింది. దీంతో తనిఖీ నిర్వహించి 60 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన జె.వేణు మారుతి మల్టీటెక్ రైస్ మిల్లులో రాయితీ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి 95 క్వింటాళ్లు, మడికొండ మండలం అమ్మవారిపేట శివారుల్లోని రాజేశ్‌కు చెందిన మహాలక్ష్మి కోళ్ల ఫారంలో 18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

కిట్స్ విద్యార్థులకు రూ.14 లక్షల ప్యాకేజీ


ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 14 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఎస్ఈ విభాగానికి చెందిన ఆకాశ్ పున్నం, సీఎస్ఎం చివరి సంవత్సరం చదువుతున్న రాకేశ్ మామిడి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇటీవల మూడు దశల్లో జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలను సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం కంపెనీ ప్రతినిధులు పంపిన నియామక పత్రాలను ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు అందజేసి అభినందించారు.

పురపాలికలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

జనగామ, న్యూస్‌టుడే: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పురపాలికలకు ఉపశమనం లభించనుంది. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్(బేసిక్) గ్రాంటు కింద నిధులను కేటాయించారు. నాన్‌మిలియన్ ప్లస్ పట్టణాల కేటగిరీలో 2023-24కు సంబంధించి రెండో విడత నిధులను విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని వేతనాలు, నిర్వహణ ఖర్చులకు వినియోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. కనీస సౌకర్యాల కల్పన, పారిశుద్ధ్య అవసరాల కోసం వస్తు సామగ్రి, వాహనాల కొనుగోలుకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. గతంలో విడుదలైన నిధులు, వినియోగం తదితర అంశాలకు సంబంధించి వివరాలను సమర్పించాలి. ఉమ్మడి జిల్లాలోని వరంగల్ కార్పొరేషన్, 9 పురపాలికలకు మొత్తం రూ. 97863789 మంజూరయ్యాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివరాలు (రూ.లలో)

పురపాలిక	విడుదలైన నిధులు
వరంగల్(కా.)	70120849
జనగామ	4421374
భూపాలపల్లి	5247185
పరకాల	2301994
డోర్నకల్	1224600
మహబూబాబాద్	6062481
మరిపెడ	1544914
తొర్రూరు	2062493
నర్సంపేట	3266607
వర్ధన్నపేట	1611292

వైద్య విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడానికి 'క్రితి' సదస్సు

● కేఎంసీలో రెండురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు


మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, క్రితి సదస్సు కన్వీనర్ డా.సుజిత్ ఆర్ పున్నం, డా.వేణుజి బత్తిని, జూనియర్ వైద్యులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఈ నెల 25, 26 తేదీల్లో కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ)లోని ఎన్ఆర్ఐ భవనంలో కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేషన్స్(క్రితి) పేరిట కాకతీయ పరిశోధన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కేఎంసీ యూఎస్ఏ అల్యూమిని, 'క్రితి' సదస్సు కన్వీనర్ డా. సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి. బత్తిని తెలిపారు. గురువారం కేఎంసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డితో కలసి వారు పరిశోధన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతో పాటు పరిశోధన వైపు మళ్లించడానికి రాష్ట్రంలోనే మొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనడానికి దేశ నలుమూలల నుంచి 1000 మందికిపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దక్షిణ భారత దేశంలోనే అత్యధిక పారితోషికం రూ. 3 లక్షలతో పాటు పరిశోధనలో అభిరుచి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిదిరకాల పోటీలు..: అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉద్దేశించిన 9రకాల పోటీలు ఇందులో ఉంటాయన్నారు. 350 మందికి పైగా విద్యార్థులు తుదిపోటీల్లో ప్రతిష్ఠాత్మక సత్కారాల కోసం పోటీపడతారన్నారు. రెండురోజుల పాటు సాగే కార్యక్రమంలో ఈ నెల 25న మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్టీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్‌క్విజ్), రెండోరోజు ఈ నెల 26న పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సింపోజియం పోటీలు ఉంటాయన్నారు. ముఖ్య అతిథులుగా కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కరుణాకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. సంధ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. కాళీప్రసాదరావు, ఏపీఐ అధ్యక్షుడు డా. సతీష్‌కతులా హాజరవుతారన్నారు. సమావేశంలో క్రితి కేఎంసీ విద్యార్థుల విభాగం ప్రతినిధులు డా. శశాంక్, రోహిత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

పోటీలో నిలిచి.. బహుమతులు గెలిచి

నర్సంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలపై ప్రావీణ్యం పెంచుకోవాలని గీతాంజలి పాఠశాల ఛైర్మన్ సుబ్బారావు, ప్రిన్సిపల్ ప్రవీణ్ అన్నారు. నర్సంపేటలోని గీతాంజలి పాఠశాలలో గురువారం 'ఈనాడు-ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు.. విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థిని ఎండీ షిఫా మెహవీన్ ప్రథమ, 9వ తరగతి విద్యార్థినులు సీహెచ్. శ్రీక ద్వితీయ, ఎం. అమృతవర్షిణి తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, పవన్, పూర్ణచందర్, వీరన్న పాల్గొన్నారు.



నర్సంపేటలో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు పొందిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ్, ఉపాధ్యాయుడు

ఆహ్వానించి.. అవగాహన కల్పించారు..!

మామునూరు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్, పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్ పరిసరాల్లోని పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించారు. పోలీసుల విధులు, ఉపయోగించే ఆయుధాలను ప్రదర్శనగా ఉంచి అవగాహన కల్పించారు. అనంతరం కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఆర్ఎస్సైలకు 'సమాజంలో పోలీసు ప్రతిష్ఠను మెరుగుపర్చడంలో నా పాత్ర', ఆర్ఐ ర్యాంకు అధికారులకు 'సౌండ్ మైండ్ ఇన్ ఏ సౌండ్ బాడీ' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమాండెంట్ రామ్‌ప్రకాష్, ప్రిన్సిపల్ పూజ, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఐలు రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ ఉన్నారు.



పిల్లలకు ఆయుధాల గురించి వివరిస్తున్న కమాండెంట్ రామ్‌ప్రకాష్



కోతకు గురైన ప్రాంతం నుంచి వృథాగా పోతున్న నీరు (పాతచిత్రం)



ప్రస్తుతం చెక్‌డ్యామ్ పరిస్థితి

నీరు నిలిచింది.. గోస తప్పింది

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ఆకేరు వాగుపై వర్ధన్నపేట, ఇల్లంద గ్రామాల మధ్యనున్న చెక్‌డ్యామ్.. గతేడాది కోతకు గురైన ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ప్రస్తుతం నీరు నిలిచింది. తద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు సాగునీరు, వర్ధన్నపేట పట్టణానికి తాగునీటి సమస్య ప్రస్తుతానికి తీరింది. గతేడాది(2023 ఆగస్టు) భారీ వర్షాలకు చెక్‌డ్యామ్ ఒకవైపు కోతకు గురైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి చుక్కనీరు నిల్వ ఉండకుండా.. కిందకి వృథాగా పోయింది. రైతులతో పాటు, పట్టణ ప్రజలకు వరప్రదాయినిగా ఉన్న చెక్‌డ్యామ్ సమస్యపై ఈనాడులో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. రైతులు, స్థానిక నేతలు, అధికారులను భాగస్వాములను చేస్తూ.. చెక్‌డ్యామ్ మరమ్మతుల ఆవశ్యకతపై చేసిన కృషికి ఎట్టకేలకు స్పందన లభించింది.

తాత్కాలిక మరమ్మతులతో ఊరట..

చెక్‌డ్యామ్ సమస్యపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాలతో స్థానిక జడ్పీటీసీ మాజీ సభ్యుడు సారంగపాణి కోతకు గురైన ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు చేయడానికి ముందుకొచ్చారు. నీరు కిందకి వెళ్లకుండా రాళ్లు వేసి.. మట్టితో కట్టగా పోసి చెక్‌డ్యామ్‌లో నీరు నిలిచేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్‌లో నీరు నిలిచి.

శాశ్వత పనులు చేపడితేనే ప్రజలకు నిశ్చింత

. అలుగు పోస్తుండటంతో అన్నదాతల్లో యాసంగి సాగుపై ఆశలు చిగురించాయి. వేసవిలోనూ పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పినట్లేనని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

వేసవిలోనే అనుకూలం..

ఆకేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్‌కు పూర్తి స్థాయిలో శాశ్వత పనులు చేపట్టి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు చెక్‌డ్యామ్ శాశ్వత అభివృద్ధి పనులకు త్వరితగతిన ప్రతిపాదనలు తయారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వచ్చే వేసవిలో పనులు చేపట్టి.. వర్షాకాలం లోపు పూర్తి చేయాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పునరుద్ధరణకు రూ.కోటి వరకు అవసరం

- అమర్‌నాథ్, ఏఈ, వర్ధన్నపేట

శాశ్వత పనులు చేపట్టేందుకు ఇప్పటికే నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు రెండుసార్లు చెక్‌డ్యామ్‌ను పరిశీలించారు. పునరుద్ధరణ పనులకు పలు సూచనలు చేశారు. దీనికి సంబంధించిన దస్త్రం హైదరాబాద్ నుంచి రావాల్సి ఉంది. ఫైల్ వచ్చిన వెంటనే దానికి అనుగుణంగా ప్రతిపాదనలు పూర్తి చేసి ప్రభుత్వానికి పంపుతాం. చెక్‌డ్యామ్ శాశ్వత పనులకు రూ.కోటి వరకు నిధులు అవసరం అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశాం.

నిధులు మంజూరు చేయాలి

- యాకయ్య, రైతు, ఇల్లంద



చెక్‌డ్యామ్ కోతకు గురికావడం వల్ల గత వేసవిలో రైతులతో పాటు ప్రజలు ఇబ్బందిపడ్డారు. తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపుకోకుండా.. ప్రభుత్వం స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేయాలి. త్వరగా శాశ్వత పనులు చేపట్టాలి.

మత్స్యకారులకు జీవనోపాధి

- సంతోశ్, వర్ధన్నపేట



చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ ఉంటే ఏడాది పొడవునా మత్స్యకారులకు ఉపాధి లభించేది. కోతకు గురైనప్పటి నుంచి నీరు వృథాగా కిందకి పోవడంతో చేపలు దొరికే అవకాశం లేకుండాపోయింది.

కొత్తవాడ, న్యూస్‌టుడే: 12వ డివిజన్ వీవర్స్ కాలనీలోని మురుగు కాలువలు చెత్తతో నిండిపోయాయి. దీంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- బండారు శ్రీనివాస్, స్థానికుడు**

సమాధానం: రెండురోజుల్లో పారిశుద్ధ్య కార్మికులతో కాలువలు శుభ్రం చేయిస్తాం.

- పసునూరి భాస్కర్, శానిటరీ సూపర్‌వైజర్

నల్లబెల్లి, న్యూస్‌టుడే: నల్లబెల్లి మండలం నందిగామలో ప్రధాన రహదారి వెంట చెత్తాచెదారం వేస్తుండడంతో దుర్గంధం వస్తోంది. **- అడ్డ రాజు, నందిగామ.**

పంచాయతీ సిబ్బందితో చెత్తను తొలగింపజేయిస్తాం.

-రాజు, పంచాయతీ కార్యదర్శి.

నెక్కొండ, న్యూస్‌టుడే: నెక్కొండ నుంచి గుండ్రపల్లి మీదుగా పెద్దకొర్పోలుకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. **- సాంబశివుడు, గుండ్రపల్లి.**

త్వరలో రహదారికి మరమ్మతులు చేయిస్తాం. **- ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో, నెక్కొండ.**

తీరిన డ్రైనేజీ సమస్య

మామునూరు, న్యూస్‌టుడే: మామునూరు గ్రామంలో వరంగల్- ఖమ్మం ప్రధాన రహదారి పక్కనే మురుగు కాలువలో కొంతకాలంగా వ్యర్థాలు నిండి మురుగు నీరు వెళ్లకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలిపారు. సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా.. జేసీబీ, పారిశుద్ధ్య సిబ్బందితో తవ్వకాలు చేపట్టి మురుగునీరు పోయేలా చేశారు.

స్పందనకు వందనం

ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



ఊకల్‌హవేలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుకొండ, న్యూస్‌టుడే: రైతు సేవా సహకార సంఘాలు రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం ఊకల్‌హవేలీలోని రైతుసేవాసహకార సంఘంలో డైరెక్టర్లు, ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వాణిజ్య బ్యాంకుల్లో రైతులకు 7 శాతం వడ్డీకి పంట రుణాలు ఇస్తుండగా సొసైటీలో 10.5 శాతం వడ్డీకి రుణాలివ్వడం వల్ల రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, సొసైటీలో వడ్డీ తగ్గించేలా కృషి చేయాలని డైరెక్టర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి సౌజన్య, సొసైటీ ఛైర్మన్ రమేష్, ఎండీ రామకృష్ణారావు, తహసీల్దార్ రియాజుద్దీన్, సొసైటీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగెం: సహకార సంఘాలు రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చేలా సేవలందించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం చింతలపల్లి, సంగెం, కాపులకనపర్తి సహకార సంఘాల పాలక మండళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సహకార సంఘాల ఆదాయ వ్యయాలపై ఆరా తీశారు. సేంద్రియ ఎరువుల వాడకం, ఆధునిక యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక గిరిజన కళాశాల బాలుర వసతిగృహాన్ని పరిశీలించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. డీసీవో నీరజ, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, ఏవో యాకయ్య, సహకార సంఘాల ఛైర్మన్‌లు కుమారస్వామి, సంపత్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వర్ధన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. వర్ధన్నపేట, ఇల్లంద, దమ్మన్నపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం చెరువులో చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సన్నరకం వరికి రూ.500 బోనస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. భారాస పదేళ్ల పాలనలో నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ అరుణ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్య, ఎంపీడీఓ వెంకటరమణ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యకుడు దేవేందర్‌రావు పాల్గొన్నారు.

☛ మండలంలోని కడారిగూడెం గ్రామానికి చెందిన నాంపల్లి భాగ్యమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజు గురువారం ఆమెను పరామర్శించి వీల్‌ఛైర్, మంచం అందజేశారు.

ఎమ్మెల్యేను నిలదీసిన కాంగ్రెస్ నేతలు..

వర్ధన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కారులో వెళ్తున్న ఎమ్మెల్యే నాగరాజును సొంత పార్టీ నేతలు, కార్యకర్తలు నిలదీశారు. పార్టీని నమ్ముకుని ఏళ్లుగా పనిచేస్తుంటే ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన వారికి ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. భారాసలో ఉండి పదవులు అనుభవించిన వారే కాంగ్రెస్‌లో కూడా పదవులు పొందడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

పర్వతగిరి: మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వసుంధర సమైఖ్య సంఘం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఏపీఎం కృష్ణమూర్తిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. దీనిని పార్టీ కార్యక్రమంలా చేయడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, ఆయా శాఖల అధికారులతో సహా అధికార పార్టీకి చెందిన నాయకులు కూర్చోవడం విడ్డూరంగా మారింది.

27న మోషన్ టాలెంట్ సెర్చ్ పరీక్ష



వివరాలు వెల్లడిస్తున్న ఛైర్మన్ వేణుగోపాల్‌గౌడ్

నయీంనగర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 27న మోషన్ టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా రూ.150 కోట్ల ఉపకార వేతనాలు, రూ.2 కోట్ల నగదు బహుమతి, 500 మందికి ఉచిత విద్య అందిస్తామని చెప్పారు. మిగతా వారికి ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 97030 00850, 97030 00852 చరవాణి నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌కుమార్‌గౌడ్, హెడ్ ఎం.సురేష్, ఏవో బి.మురళి, సుమన్, రమేష్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పోడుపట్టాల తయారీలో మరో ముగ్గురి అరెస్టు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: నకిలీ పోడు పట్టాల తయారీలో అటవీ అధికారులు గురువారం మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఇద్దరిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన వరంగల్ నగరానికి చెందిన గణేష్ ప్రింటర్స్ యజమాని తాటిపాముల రాజు, పోడు పట్టాపుస్తకానికి క్యూఆర్ కోడ్ సృష్టించిన భూక్య వెంకన్న, అటవీహక్కు పాసు పుస్తకం నమూనాను పంపిన జాటోత్ రాజ్‌కుమార్(ఎఫ్ఆర్సీ ఛైర్‌పర్సన్)లను అదుపులోకి తీసుకుని జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్ గురువారం వివరాలు వెల్లడించారు. గణేష్ ప్రింటర్స్ యజమాని రాజు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి పాసు పుస్తకాన్ని తయారు చేశాడన్నారు. అతడి కంప్యూటర్‌ను తనిఖీ చేయగా.. ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల పేర్లతో సుమారు 500 నకిలీ పోడు పట్టా పుస్తకాలు తయారు చేసినట్లు సమాచారం ఉందన్నారు. హోలోగ్రామ్ తయారుచేసిన బానోత్ హరినాయక్, అటవీ శాఖ రేంజ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రాన్ని రూపొందించిన దారావత్ కిషన్‌లు పరారీలో ఉన్నారన్నారు. ములుగు ఏపీజీవీబీలో రుణం పొందిన ఆరు పుస్తకాలను, ములుగు మండలం కాసిందేవిపేట పంచాయతీ పరిధి రామయ్యపల్లి గ్రామంలో రైతుల వద్ద నుంచి మూడు పుస్తకాలను సేకరించామన్నారు. గతంలో పనిచేసిన ములుగు జిల్లా కలెక్టర్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో, జిల్లా అటవీశాఖ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి పెద్దఎత్తున రైతుల నుంచి ఒక్కో పుస్తకానికి రూ.30 నుంచి 50 వేల వరకు వసూలు చేసినట్లు వివరించారు. అంతకుముందు అదుపులోకి తీసుకున్న ఇద్దరితో పాటు గురువారం అదుపులోకి తీసుకున్న ముగ్గురిని పోలీసు స్టేషన్‌కు పంపిస్తామని డీఎఫ్‌వో పేర్కొన్నారు.

ప్రాణదాతలుగా నిలవండి



రక్తదానం చేసిన ఏసీపీ తిరుపతికి ధ్రువపత్రం అందిస్తున్న ఆశాదేవి చిత్రంలో డీసీపీ రవీందర్

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ యువతకు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల దినోత్సవాల సందర్భంగా గురువారం బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు, పోలీసు అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. ఎంజీఎం రక్తనిధి కేంద్రం ఇన్‌ఛార్జి డా.ఆశాదేవి, మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ రమేష్, ఎస్సైలు శ్రీకాంత్, కృష్ణవేణి, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, కళాశాల ప్రిన్సిపల్ డా.ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

రాయపర్తి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఉపేంద్ర, పెర్కవేడులో కుమారస్వామి ఇటీవల మరణించగా, వారి పెద్దబ్బాయి ఆసుపత్రిలో చికిత్స పొందారు. గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బురహాన్‌పల్లి గ్రామానికి చెందిన రమ్య ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా.. రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు సుధీర్‌రెడ్డి, అనిమిరెడ్డి, కుమార్‌గౌడ్, నయీమ్, మధు తదితరులు పాల్గొన్నారు.

పోలియో నివారణపై అవగాహన

శివనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వరంగల్ డివిజన్ తపాలా కార్యాలయం ఎదుట పోలియో రహిత సమాజం కోసం ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోటరీ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. రోటరీ క్లబ్ వరంగల్ అధ్యక్షుడు కురవెళ్ల రాజగోపాల్‌రావు, కార్యదర్శి గంట వేణుగోపాల్, కృష్ణమోహన్, క్రాంతికుమార్, వైద్యనాథ్, నాగరాజు, రమేశ్‌బాబు, సుధాకర్, మదన్, డా.హరిరమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రాయపర్తి, న్యూస్‌టుడే: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సరిత గురువారం తెలిపారు. ఇటీవల వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫెడరేషన్ వారు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన రోహిత, స్వాతి ఈ నెల 26న హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయురాలికి అభినందన



ఫిర్దోస్

రంగశాయిపేట, న్యూస్‌టుడే: రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న సుమయ్య ఫిర్దోస్(టీటీసీ) ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. కళాశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో అధ్యాపక బృందం, విద్యార్థులు ఆమెను అభినందించారు. శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన ఫిర్దోస్ అదే బడికి ఉపాధ్యాయురాలిగా రావడం గమనార్హం. ప్రిన్సిపల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఉన్నారు.

కరాటే శిక్షణతో ఆత్మరక్షణ



మాట్లాడుతున్న యువజన, క్రీడల అధికారి సత్యవాణి

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులు తప్పనిసరిగా కరాటే శిక్షణ తీసుకోవాలని వరంగల్ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి టీవీఎల్.సత్యవాణి తెలిపారు. గురువారం కాశీబుగ్గ ఓసిటీలోని యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో కరాటే మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడారు. 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షస్' శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థినులకు కరాటే శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన కరాటే మాస్టర్లు నవంబరు నుంచి జనవరి వరకు శిక్షణ అందిస్తారన్నారు. జిల్లా బాలిక అభివృద్ధి అధికారి కె.ఫ్లోరెన్స్, సీనియర్ కరాటే మాస్టర్లు శ్రీనివాస్, ధన్‌రాజ్, కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



తేదీలు దిద్ది ఉన్న సెలవు లేఖలను చూపుతున్న డీఈవో జ్ఞానేశ్వర్

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఈఓ జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. వర్ధన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉదయం 8 గంటలకు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. మొత్తం 20 మంది ఉపాధ్యాయులుండగా.. ఇద్దరు సర్దుబాటుతో ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. ఒకరు జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. 17 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా గురువారం పది మంది ఉపాధ్యాయుల మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఏడుగురు ఉపాధ్యాయులు పాత సెలవు లేఖలకు తేదీని మార్చివేయడాన్ని గుర్తించారు. ధనలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు ఉదయం విధులకు హాజరు కాకుండానే మధ్యాహ్నం నుంచి సెలవు పెడుతున్నట్లు లేఖను చూసి డీఈఓ అవాక్కయ్యారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న సమయంలో నిర్ణీత సమయానికి ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు సెలవులో ఉండడంతో చరవాణిలో మాట్లాడి సమస్యలపై నిలదీశారు. పాఠశాల నిర్వహణపై మండిపడ్డారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో చరవాణిలో మాట్లాడారు.

బాల చెలిమి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తాం



బాల చెలిమి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేదకుమార్, రవికుమార్

నర్సంపేట, న్యూస్‌టుడే: ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్త, బాల చెలిమి, దక్కన్ పత్రికల సంపాదకుడు మణికొండ వేదకుమార్ గురువారం నర్సంపేటలోని లీడ్ గ్రంథాలయాన్ని సందర్శించారు. పుస్తకాలను, పత్రికలను పరిశీలించారు. వేదకుమార్ మాట్లాడుతూ లీడ్ గ్రంథాలయం ఆధ్వర్యంలో నర్సంపేటలో బాల చెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రంథాలయ నిర్వాహకులు కాసుల రవికుమార్, శోభారాణి దంపతులను సత్కరించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కేపీ రావు, ఆర్కియాలజిస్టు రాంరాజ్, స్థానిక విజ్డమ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జావెద్, ఉపాధ్యాయులు రఘుపతి, కుమార్ పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

సమస్యల పరిష్కారానికి మార్క్సిజమే ప్రత్యామ్నాయం

నర్సంపేట గ్రామీణం,న్యూస్‌టుడే: దేశంలో ప్రజా సమస్యల పరిష్కారానికి మార్క్సిజం, అంబేడ్కర్ ఆలోచనా విధానమే సరైన ప్రత్యామ్నాయమని ఎంసీపీఐయూ డివిజన్ సహాయ కార్యదర్శి రాజమౌళి అన్నారు. నర్సంపేట మండలం నాగుర్లపల్లిలో గురువారం ఎంసీపీఐయూ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే ఓంకార్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. సదానందం, రమేష్, రవి, చంద్రమౌళి, నరసింహస్వామి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించని ఏజెన్సీలపై చర్యలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రాంరెడ్డి

దుగ్గొండి, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించని ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. ఆయన గురువారం దుగ్గొండి ఉన్నతపాఠశాలలో మధ్యాహ్నభోజనం వంటలను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్ గౌడ్, ప్రధానోపాధ్యాయుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి సరఫరాపై మిషన్ భగీరథ సిబ్బందికి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. మిషన్ భగీరథ ఏఈ సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్స్‌లో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట గ్రామీణం,న్యూస్‌టుడే: నర్సంపేట మండలం లక్నేపల్లిలోని బిట్స్ కళాశాలలో మెకానికల్ విభాగం చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రథిరాజ్ మెటల్ మాస్టర్స్ సంస్థ తరపున గురువారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు హాజరు కాగా 15 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంస్థ డైరెక్టర్ శ్రీధర్, సలహాదారు ఉమేష్ జితాని తెలిపారు. ప్రిన్సిపల్ హరిహరన్, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ముఖ్య ప్రాంగణ నియామకాధికారి సురేష్, స్టూడెంట్స్ డీన్ ఫణీంద్ర, టీపీవో రణధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సంఖ్యపై సర్వే

ఖానాపురం,న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉన్నత విద్యనభ్యసించిన నిరుద్యోగుల సంఖ్యపై గురువారం డీఆర్డీవో, ఐకేపీ వీవోఏలు సర్వే చేపట్టారు. నిరుద్యోగుల వివరాలను నమోదు చేశారు. వారికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు నాణ్యమైన శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి లైవ్‌లీ వుడ్ మానిటరింగ్ బృందం సభ్యులు సుబ్రహ్మణ్యంరెడ్డి, జయప్రకాష్ అన్నారు. వారు గురువారం ఎల్లాయిగూడెం, లింగాపురం గ్రామాలను సదర్శించారు. ఎల్లాయిగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బ్యాంకుల సేవలు, ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో శ్రీవాణి, ఏపీఎం ఈశ్వరయ్య, ఏపీవో అరుణ, పంచాయతీ కార్యదర్శి నిట్టు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దుగ్గొండి: పొనకల్‌లో రెడ్డబోయిన కుమారస్వామి ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. బియ్యాన్ని గ్రామస్థుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు నిల్వ చేశారని, టాస్క్ ఫోర్సు పోలీసులతో కలిసి దాడి చేసి చేసినట్లు పేర్కొన్నారు. కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

తాడి చెట్టుపై నుంచి పడి గాయాలు

దుగ్గొండి, న్యూస్‌టుడే: మండలంలోని చంద్రయ్యపల్లికి చెందిన గీతకార్మికుడు గడ్డమీది చేరాలు గురువారం తాటి చెట్టుపై నుంచి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు ఆయనను 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంఆసుపత్రికి తరలించారు.

పాత కక్షలతో అన్నపై దాడి

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాత కక్షలతో అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన నర్సంపేట మండలం ఇటుకాలపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటుకాలపల్లికి చెందిన బుర్ర వెంకటేశ్వర్లు, బుర్ర శ్యాంసుందర్ అన్నదమ్ములు. వ్యవసాయ భూమి విషయంలో వీరి మధ్య ఐదేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. వెంకటేశ్వర్లు గౌడ సంఘం పెద్ద మనిషిగా కొనసాగుతుండటంతో ఆ పదవి విషయంలో శ్యాంసుందర్ నెల క్రితం గొడవకు దిగాడు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు గురువారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శ్యాంసుందర్ కర్రతో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన వెంకటేశ్వర్లును హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నర్సంపేట గ్రామీణం,న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మహిళ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట మండలం ముత్తోజిపేటకు చెందిన ఎండీ.శంషోద్దీన్, సుల్తానా(45) దంపతులు ఉపాధి కోసం ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నారు. ఈనెల 21న శంషోద్దీన్, సుల్తానాలు ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తుండగా కూకట్‌పల్లి సమీపంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన సుల్తానా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, నాయకులు పరామర్శించారు.

రాత్రి అపహరించారు.. ఉదయం బిగించారు

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట మున్సిపాలిటీలో మంచినీటి విభాగంలో పని చేసే కొందరు సిబ్బంది బుధవారం రాత్రి నర్సంపేటలోని ఫిల్టర్‌బెడ్ వద్ద ఉన్న పెద్ద గేట్‌వాల్వ్‌ను అపహరించారు. విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో తిరిగి గురువారం ఉదయం బిగించారు. బుధవారం మధ్యాహ్నం ఫిల్టర్‌బెడ్ వద్ద కొందరు సిబ్బంది విందు చేసుకున్నారు. రాత్రి కొందరు ఫిల్టర్‌బెడ్ వద్ద ఉన్న గేట్‌వాల్వ్‌ను యంత్రంతో కోసి చోరీ చేశారు. గురువారం ఉదయం సిబ్బంది వచ్చి మోటార్‌ను ఆన్ చేయగా నీరు వృథాగా పోయింది. అక్కడున్న గేట్‌వాల్వ్ కనిపించక పోవడంతో అధికారులకు చెప్పారు. దీంతో చోరీకి పాల్పడిన సిబ్బంది ఆటోలో గేట్‌వాల్వ్‌ను తీసుకొచ్చి బిగించారు. ఈ విషయాన్ని పురపాలిక ఏఈ రాజేశ్ వద్ద ప్రస్తావించగా గేట్‌వాల్వ్‌ను తీసుకెళ్లిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పర్వతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను జమాల్‌పురం మూల మలుపు వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ గురువారం తెలిపారు. డ్రైవర్లు, యాజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చిల్లర కాంటాలపై అధికారుల దాడులు

నర్సంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో పత్తి కొనుగోళ్లకు నిర్వహిస్తున్న చిల్లర కాంటాలపై గురువారం మార్కెట్ అధికారులు దాడులు చేశారు. 45 క్వింటాళ్ల పత్తి, 50 క్వింటాళ్ల మొక్కజొన్నలను స్వాధీనం చేసుకొని రుసుం విధించారు. నర్సంపేట మార్కెట్ సూపర్‌వైజర్ శివకుమార్, సిబ్బంది సతీశ్, సురేశ్, ప్రవీణ్‌లు కొండాయిలుపల్లి, నల్లబెల్లి, నల్లబెల్లి క్రాస్‌లో పత్తి, మొక్కజొన్నలకు వేస్తున్న చిల్లర కాంటాలను అడ్డుకున్నారు. చిల్లర వ్యాపారులకు సరకును విక్రయించొద్దని రైతులకు సూచించారు.